www.suryaa.com
నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల
మంగళవారం | 02 ఏప్రిల్ 2024 | పేజీలు 8

శ్రీగిరిపై ఈనెల 6 నుంచి

# ఉగాది మహోత్సవాలు

- ఉగాది మహోత్సవాల సందర్భంగా చలువ పందిర్లు ఏర్పాటు

2లో


శ్రీశైల మహా పుణ్య క్షేత్ర ఆలయ దృశ్యం



# ఉమ్మడి పొత్తూ..
# ఏదీ నీ చిరునామా..!

- ఆత్మకూరు-డోన్ మినహా కలవని బీజేపీ
- ఆళ్లగడ్డలో కలవని జనసేన
- పొత్తు చిహ్నంలో రెండు గుర్తులే
- ఒక సామాజిక ఓటు బ్యాంకు భయం
- ఆళ్లగడ్డలో భూమా-ఇరిగెల మధ్య వర్గపోరు
- నంద్యాలలో ఫరూక్- అభిరుచి మధ్య దూరం
- చంద్రబాబు ప్రజాగళంలో ఎగరని బీజేపీ జెండా

2లో

నంద్యాల మేజర్‌న్యూస్ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేనలు ఉమ్మడి పొత్తుతో పోటీ చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలో పార్టీలు ఉమ్మడి పొత్తు ధర్మాన్ని పాటించలేక పోతున్నాయి. ఒకటి, రెండు నియోజక వర్గాలు మినహా నంద్యాల జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో తెలుగుదేశం - బీజేపీ, తెలుగుదేశం - జనసేనలు కలిసి వేదికలను పంచుకోలేకపోతున్నాయి. ఆత్మకూరు, డోన్ నియోజకవర్గాల్లో బీజేపీ తెలుగుదేశంతో కలిసి ప్రయాణం చేస్తున్నాయి. ఆళ్ళగడ్డలో తెలుగుదేశం జనసేనలు ఉమ్మడిగా ప్రచారం సాగించలేక పోతున్నాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక సామాజిక ఓటు బ్యాంక్ భయంతో అభ్యర్థులు భారతీయ జనతా పార్టీతో కలిసి ప్రయాణం సాగించలేక పోతున్నారు. ఆళ్ళగడ్డలో భూమా - ఇరిగెల మధ్య వర్గపోరుతో తెలుగుదేశం, జనసేనలు ఎన్నికల ప్రచారాన్ని కలిసి చేయలేకపోతున్నారు. నంద్యాలలో టీడీపీ అభ్యర్థి ఫరూక్, బీజేపీ కన్వీనర్ అభిరుచి మధు మధ్య దూరం స్పష్టంగా కనిపిస్తుంది. చివరకు చంద్రబాబు ప్రజాగళంలో సైతం బీజేపీ జెండాలు ఎగరలేకపోతున్నాయి. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ఉమ్మడి పొత్తు చిహ్నాన్ని ప్రదర్శించలేకపోతున్నారు. బీజేపీ కమలం గుర్తు లేకుండానే పొత్తు చిహ్నంలో సైకిల్, గ్లాస్‌తో ప్రచారాలు సాగిస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..


అభిరుచి మధు


ఎన్ఎండి. ఫరూక్


ఇరిగెల రాంపుల్లారెడ్డి


భూమా అఖిలప్రియ


బైరెడ్డి శబరి


బిసి.జనార్ధన్‌రెడ్డి

ప్రచారాలలో స్పీడ్ పెంచిన

# కోట్ల కుటుంబం


కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి


బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- మంత్రి వర్యా..ప్రచారాలకు రండి ఆర్యా..
- ఒంటరిగా పోరాటం చేస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి
- నియోజకవర్గంలో వైకాపాలో కానరాని ఉత్సాహం
- ఫోటోలకు ఫోజులకు తప్పా..ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో వైసీపీ శ్రేణులు విఫలం
- అభివృద్ధి మాత్రమే గెలిపిస్తుందనే ధీమాలో వైసీపీ క్యాడర్
- సమయం ముంచుకొస్తున్న మొద్దు నిద్ర వీడని మండల వైకాపా నాయకులు
- బుగ్గన హ్యాట్రిక్‌కు గండికొట్టేందుకు ప్రచారాలలో దూసుకుపోతున్న కోట్ల కుటుంబం

**డోన్, మేజర్‌న్యూస్‌:** 2014, 2019 ఎన్నికలలో డోన్ నియోజకవర్గంలో ఒక చరిత్రను సృష్టించారన్న కీర్తి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఉంది. 2014 ఎన్నికల్లో డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా వైయస్ఆర్ పార్టీ తరపున గెలిచినప్పటికీ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేగా డోన్ అభివృద్ధిపై నామమాత్రంగా ఉండాల్సిన స్థితి. తిరిగి 2019 ఎన్నికలలో రెండవసారి నియోజక వర్గ ప్రజలు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇదే డోన్ నియోజకవర్గ ప్రజలు

మిగతా 2లో

# కాంగ్రెస్ పార్టీలోకి లక్కిటూ రాంపుల్లయ్య యాదవ్


షర్మిలరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్కిటూ రాంపుల్లయ్య యాదవ్

- పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి సమక్షంలో చేరిక..
- టీడీపీలో యాదవులకు గుర్తింపు కరువు..
- కర్నూలు ఎంపిగా బరిలోకి..

**కర్నూలు,మేజర్ న్యూస్‌:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు లక్కిటూ రాంపుల్లయ్య యాదవ్ ఆది వారం హైదరాబాద్‌లో టిడిపిని వీడి పిసిసి అద్యక్షురాలు షర్మిలరెడ్డి ఆద్వ ర్యంలో కాంగ్రేస్ పార్టీలోకి చేరారు. ఈసందర్భంగా రాంపుల్లయ్య యాదవ్ కు కాంగ్రేస్ పార్టీ అద్యక్షురాలు షర్మిల రెడ్డి కాంగ్రేస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడమేగాకకర్నూలు ఎంపిగా సీటు ఖరారు చేశారు. అనంతరం లక్కి టూ రాంపుల్లయ్య యాదవ్ మాట్లాడు తూ తెదేపాలో చాలా కష్టపడ్డామని హిందూపురం

మిగతా 2లో

పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా

# ప్రజలు జాగ్రత్తలు పాటించండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

2లో



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

డబ్బులు లేనందునే

# పింఛన్ల పంపిణీకి బ్రేక్


మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

2లో

- ఉన్న సొమ్మును తమ కాంట్రాక్టర్లకు ధారాదత్తం
- నగదు ఉంటే సచివాలయం ఉద్యోగులతో పంచవచ్చు
- వాలంటరీ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే పింఛన్ సొమ్ము పెంపు
- డోన్ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి

సూర్య



# ఉమ్మడి పొత్తూ ..ఏదీ నీ చిరునామా..!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఉమ్మడి పొత్తుతో పోటీ చేస్తున్న పొత్తు ధర్మం పాటించలేక పోతున్నాయి.సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేనలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అధికార వైసీపీని ఢీకొడుతున్నాయి. నంద్యాల జిల్లాలో డోన్ నియోజకవర్గంలో సిపిఐ పార్టీ పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పొత్తు ధర్మానికి దూరంగా ఉంటున్నారు. ఆత్మకూరు, డోన్ నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిలతో కలసి బీజేపీ శ్రేణులు పని చేస్తున్నాయి. ఆత్మకూరులో బీజేపీ కన్వీనర్ షబానా, బుడ్డాతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. డోన్ నియోజకవర్గంలో బీజేపీ కన్వీనర్ సందు వెంకట రమణ, కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డితో కలసి ప్రయాణం చేస్తున్నారు. ఆ నియోజకవర్గంలో బీజేపీలో రెండు వర్గాలు కోట్లతో ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో భూమా – ఇరిగెల వర్గాల మధ్య వర్గపోరుతో జనసేన ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంది. టీడీపీ అభ్యర్థితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. ఆళ్ళగడ్డ బీజేపీ కన్వీనర్ భూమా కిశోర్‌రెడ్డి ఆ పదవికి, పార్టీకి రాజీనామ చేసి వైసీపీ గూటికి చేరారు. ఆయన వర్గంలోని బీజేపీ శ్రేణులను వైసీపీలోకి తీసుకొని వస్తున్నారు. నంద్యాలలో గత ఎన్నికల నాటి నుంచి ఫరూక్, అభిరుచి మధు మధ్య దూరం పెరుగుతూ వస్తుంది. 2019 సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అభిరుచి మధు టీడీపీని వీడి బీజేపీలో చేరారు. నాలుగు నెలల క్రితం ఆయనను నంద్యాల కన్వీనర్‌గా అధిష్టానం నియమించింది. అప్పటి నుంచి ఆయన నంద్యాల నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. అధిష్టానం ఆదేశించినా పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారు. ఉమ్మడి పొత్తులో నంద్యాల అసెంబ్లీని తెలుగుదేశం పార్టీకి కేటాయించడంతో అభ్యర్థి ఎన్‌ఎండి ఫరూక్ బరిలోకి దించింది. ఫరూక్, మధుల మధ్య దూరం ఒక వైపు, నంద్యాల సీటును బీజేపీ ఆశించడం మరో వైపుతో రెండు పార్టీలు కలసి ముందుకు కదలలేకపోతున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి ఆ పార్టీకి, పదవికి రాజీనామ చేసి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన విషయం పాఠకులకు విధితమే. నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆమె పోటీ చేస్తున్నారు. బీజేపీకి ఆమె రాజీనామ చేయడంతో జిల్లాలో బీజేపీ పరిస్థితి చుక్కానిలేని నావలాగా తయారైంది. తాజాగా బీజేపీ అధిష్టానం అభిరుచి మధును నంద్యాల పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ నియామక పత్రాలను జారీ చేసింది. నంద్యాల జిల్లాలో నంద్యాలతోపాటు ఆత్మకూరు, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఒక సామాజిక వర్గం ఓట్లు గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో ఆ సామాజిక వర్గం ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. బీజేపీ సార్వత్రిక ఎన్నికల వేళ సిఎఎలను తీసుకొని వచ్చింది. సిఎఎలపై ఒక సామాజికవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఆ ప్రభావంతో తెలుగుదేశం అభ్యర్థులు బీజేపీతో కలసి నడిచేందుకు జంకుతున్నారు. ఒకటి, రెండు నియోజకవర్గాల్లో ఉమ్మడి పొత్తులో ఉండాల్సిన కమలం సైకిల్, గ్లాస్ స్థానాల్లో సైకిల్, గ్లాస్‌తోనే ప్రచారంలో పాల్గొంటున్నారు. శబరి జిల్లా అధ్యక్షురాలుగా పని చేయడంతో నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ఆమె వర్గీయులే కన్వీనర్ బాధ్యతలను నిర్వహించారు. శబరి పార్టీ మారడంతో ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో బీజేపీ కన్వీనర్‌గా సుబ్బారెడ్డి ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా బిసి జనార్థన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇద్దరు ఒకే వేదికను ఇప్పటి వరకు పంచుకోలేదు. తాజాగా చంద్రబాబు బనగానపల్లె నియోజకవర్గంలో ప్రజాగళాన్ని చేపట్టిన విషయం పాఠకులకు విధితమే. ప్రజా గళంలో బీజేపీ జెండాలు ఎగరలేదు.తెలుగుదేశం,జనసేన జెండాలు రెపరెప లాడాయి. పొత్తు పార్టీల అధిష్టానాలు రాబోయే ఎన్నికల్లో అధికారాన్ని కైవసం చేసుకునే దిశగా పొత్తుతో ముందుకు సాగుతుంటే జిల్లాలోని ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో వర్గపోరు ఒక వైపు, విభేదాలు మరో వైపుతో తెదేపా, బీజేపీ, జనసేనలు కలసి ప్రచారం సాగించలేకపోతుండటంతో రాబోయేఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికల నామినేషన్ల ఘట్టానికి సమయం దగ్గర పడు తుండటంతో ఆయా పార్టీల అధిష్టానాలు మూడు పార్టీల కూటమి సం యుక్తంగా కలసి ఎన్నికల ప్రచారం సాగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రచారాలలో స్పీడ్ పెంచిన కోట్ల కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)

బుగ్గనపై ఉంచిన నమ్మకం. అదే నమ్మకంతోనే డోన్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన సంగతీ మనకు తెలిసిందే. అయితే అప్పటికే గత కొన్ని దశాబ్దాలుగా రెండే కుటుంబాలు డోన్ నియోజకవర్గాన్ని శాసిస్తున్న సమయంలో ఒక్కసారిగా బుగ్గన నియోజకవర్గ ప్రవేశంతో కోట్ల, కేఈ కుటుంబాల పాలనకు తెరపడిందనే చెప్పాలి. ఇక 2019 ఎన్నికలలో వైయస్ఆర్ పార్టీ అధికారంలోకి రావడం, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల కోరికమేరకే రాష్ట్ర ఆర్థికశాఖమంత్రిగా బాద్యతలు చేపట్టడం జరిగింది. మంత్రిగా బాద్యతలు చేపట్టిన నాటి నుండి ఎన్నికల కోడ్ వచ్చేంత వరకు కూడా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన సంగతీ ప్రజలకు విధీతమే. అయితే ఇక్కడ అస్సలు సంగతీ ఏమిటంటే గత రెండున్న ర సంవత్సరాల క్రితం కోట్ల కుటుంబంగాని, కేఈ కుటుంబం గాని నియోజకవర్గం గురించి పునరాలోచించకపోవడం, వీరువురి కుటుంబాల నుండి ఎవ్వరు కూడా డోన్ నియోజకవర్గ టిడిపి బాద్యతలు చేపట్టడానికి ముందుకు రావకపోవడంతో వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఉన్న ధర్మారం మన్నె సుబ్బారెడ్డిని డోన్ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్‌గా నారా చంద్రబాబునాయుడు ప్రకటించి, దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పార్టీ అభ్యున్నతికి, మంత్రి బుగ్గనను ఎదుర్కుంటూ తెలుగుదేశం పార్టీ పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు తన శాయశక్తులా కృషి చేశాడు. చివరకు టిడిపి అధిష్టానం కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ధర్మారం మన్నె సుబ్బారెడ్డి, ఆయన అనుచరులు ఒకింత అలకబూనడంతో గత నాలుగు రోజుల క్రితం అలకను మాన్పించి, ధర్మారం మన్నె సుబ్బారెడ్డికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పదవిని అధిష్టానం ఇచ్చింది. సరే ఇవన్నీ తెలియని విషయాలు కాదనుకోండి. ఇక అస్సలు విషయానికి వస్తే 2024 సార్వత్రిక ఎన్నికలలో మంత్రి బుగ్గనను ఢీ కొట్టడం అంతఆషామాషీ కాదని, అందుకు సరైన అభ్యర్థి కావాలని, అందులో భాగంగానే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని టిడిపి తరపున ఎన్నికల బరిలో నిలిపింది టిడిపి అధిష్టానం. కర్నూలు ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ రాజకీయ కుటుంబంగా పేరొందిన కోట్లను అభ్యర్థిగా ప్రతిపక్షం బరిలో నిలిపినప్పుడు వైయస్ఆర్ పార్టీ తరపున మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనగకుండా, ఆయన తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డిని ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలో తిప్పుతూ ఒంటరి పోరాటం చేస్తున్నారు. అయితే ఇటు వైకాపా నాయకులు మాత్రం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాలలో కేవలం సోషల్‌మీడియాలో ఫోటోలు పంపించుకోవడానికి తప్పా, ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారంటూ ప్రజలే బహిరంగంగానే చర్చించుకోవడం నేడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల కోడ్ రాక ముందు, వచ్చిన తరువాత అడపాదడపా మాత్రమే నియోజకవర్గానికి వచ్చిన మంత్రి బుగ్గన, ఇక ఎన్నికల ప్రచారాలలో ఎక్కడా కానరాకపోవడంతో వైసిపి శ్రేణులలో నిరుత్సాహాన్ని నింపుతుంది.మరోవైపు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా నియోజకవర్గంలో ప్రచారాలలో దూసుకుపోతూ, ఇక గెలిచేది మేమే, వచ్చేది తెలుగుదేశం పార్టీనే అనే స్థాయిలో ప్రచారాలలో వేగం పెంచి, ప్రజాక్షేత్రంలో కోట్ల కుటుంబానికి ఎదురులేదనే తీరుగా ఇప్పటికే ప్రజలను ప్రసన్నం చేసుకోవడంలో సఫలం అయ్యారు. కాని ఇంకో వైపువైసిపి మండలస్థాయి నాయకులు మాత్రం బుగ్గన చేసిన అభివృద్ధి, సిఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్న ధీమాలో ఉంటూ, ప్రజాక్షేత్రంలో ఉండకుండా ఎన్నికల సమయం ముంచుకొస్తున్నప్పటికి, కోట్లను ఢీకొనడంలో వైఫల్యం చెందుతూ, నేటికి నిద్రావస్థలో ఉండిపోవడం దారుణమనే చెప్పాలి. మంత్రి బుగ్గన ప్రచార బరిలో దిగితేతప్పా వైకాపా శ్రేణులలో ఉన్న నిద్రావస్థను తరిమేయవచ్చంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. కోట్ల కుటుంబం వైకాపా చేస్తున్న పాలనపై దుమ్మెత్తిపోస్తునప్పటికీ, ఏనాడూ కూడా అందుకు సమాధానం ఇవ్వడంలో వైకాపా శ్రేణులు మిన్నకుండిపోవడంపై డోన్ నియోజకవర్గ రాజకీయాలలో ఎప్పుడు ఏ పరిణామం చోటుచేసుకుంటుందోననే అనుమానాలు ప్రజలలో రేకెత్తిస్తున్నాయి. ఏదో కంటితుడుపు చర్యలో భాగంగా పాత్రికేయుల సమావేశాలు నిర్వహిస్తున్న వైకాపా క్యాడర్ శనగలు తిని చేతులు కడుక్కుంటున్న తీరుపై అనుమానాలు వ్యక్తంమౌతున్నాయి. అలాగే ఇప్పటికే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, కోట్ల నివేదితరెడ్డి, కోట్ల రాఘవేంద్ర రెడ్డిలు కుటుంబ సమేతంగా నియోజకవర్గాన్ని జల్లెడపడుతుంటే కేవలం మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి మాత్రమే వైసిపి తరపున నియోజకవర్గం మొత్తం తిరగడం పార్టీ శ్రేణులలో ఒకింత నిరుత్సాహానికి గురిచేస్తుంది. రాజకీయంగా అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ తండ్రి గెలుపుకు వన్‌మెన్ ఆర్మీగా పోరాడుతూ, నిత్యం నియోజకవర్గంలోని ఏదో మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. కాని డోన్ నియోజకవర్గంలోని మూడు మండలాలలో మాత్రం ఎక్కడా కూడా మంత్రి బుగ్గన ప్రజల మద్యకు రాకపోవడంతో వైసిపి శ్రేణులు నిద్రావస్థలోఉండిపోవడమే కాకుండా, కేవలం అరకొరగా నిర్వహిస్తున్ని ఎన్నికల ప్రచారాలకు సంబందించి ఫోటోలకు మాత్రం ఫోజులిస్తూ, సోషల్ మీడియాలో తెగ తిరిగేస్తున్నామనే ఊహను ప్రజలలోకి తీసుకెళ్తున్నారే తప్పా ఎక్కడా కూడా వైకాపా నాయకులు ప్రజలను ప్రసన్నం చేసుకోవడం లేదనే అరోపణలు తప్పడం లేదు. హడావుడి తగ్గించి, ప్రజాక్షేత్రంలో పార్టీ క్యాడర్ ఉండే విధంగా మంత్రి బుగ్గన నియోజకవర్గ కేంద్రంలో తిష్టవేస్తే తప్పా, వైకాపా గురించి నియోజకవర్గంలో చర్చించడానికి ఇంకెవ్వరు ఉండరని, కోట్ల కుటుంబం చేస్తున్న ఎన్నికల ప్రచారాలే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

# శ్రీగిరిపై ఈనెల 6 నుంచి ఉగాది మహోత్సవాలు



శ్రీశైల ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల మహా క్షేత్రంలో ఈనెల 6 వ తేదీ నుండి 10 తేదీ వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.ముఖ్యంగా ఈ ఉత్సవాలలో కర్ణాటక రాష్ట్రములోని పలు ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శించడం జరుగుతోంది.పాదయాత్ర ద్వారా కూడా భక్తులు ఎక్కువ సంఖ్యలో విచ్చేయడం విశేషం.ఇప్పటికే భక్తులు అధికసంఖ్యలో క్షేత్రాన్ని చేరుకోవడం జరుగుతోంది.భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వివిధ విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు.

**చలువ పందిర్ల ఏర్పాటు :** భక్తులు సేదతీరేందుకు వీలుగా టోల్ గేట్ వద్ద గల బసవవనం, సిబ్బంది వసతి గృహాల వద్ద గల బాలగణేశవనం,పాతాళగంగమార్గములోని శివదీక్షా శిబిరాలు, ఆలయ పుష్కరిణి వద్దగల శ్రీపర్వతవనం,ఆలయ దక్షిణమాడవీధిలో గల రుద్రాక్షవనం,శివాజీగోపురానికి ఎదురుగా గల శివాజీవనం మొదలైనచోట్ల ఈ చలువపందిర్లు వేయబడ్డాయి.అలాగే మాడవీధిలో కూడా చలువపందిర్లు వేయడం జరిగింది.అదేవిధంగా కాలిబాట మార్గములోనివెంకటాపురం,నాగలూటి,దామర్లగుంట, పెద్దచెరువు,కైలాసద్వారం , మొదలైనచోట్ల కూడా చలువపందిర్లను ఏర్పాటు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి లక్కిటూ రాంపుల్లయ్య యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలకులుగా సోదరుడు నరసింహులు యాదవ్ పనిచేశారని కర్నూలు ఎంపిగా గాని జిల్లాలో ఏదైనా ఒక అసెంబ్లీ స్థానం యాదవులకు ఇవ్వాలని అడిగామని అన్నారు.గతంలో వైసిపిలో కర్నూలు మేయర్ స్థానాన్ని వదలి టిడిపిలోకి కోట్ల కుటుంబంతో పాటు కలిసి వచ్చామని వచ్చాక ఐదేళ్లు పార్టీకోసం కష్టపడ్డామని కర్నూలు కార్పోరేషన్‌లో మూడు స్థానాలకు పోటీచేసి ఒక స్థానంలో విజయం సాదించామని మిగతా రెండు చోట్ల స్వల్ప మెజారిటితో ఓడిపోయామన్నారు.అయితే టిడిపి పార్టీ ఉమ్మడి కర్నూలు,అనంతపురం జిల్లాలో వాల్మికి,కురువలతో పాటు సమానంగా ఉన్న తమను విస్మరించారని బిసిలంటే కేవలం రెండు సామాజిక వర్గాలు మాత్రమే పార్టీలకు గుర్తుకు వస్తున్నాయని ఇరువురికి ఎంఎల్ఏ,ఎంపిసీట్లతో కలిపి నాలుగు నుండి ఐదు సీట్లు కేటాయించారని అత్యల్ప జానాభా ఉన్న రెడ్లు,కమ్మలకు సీట్లు కేటాయిస్తున్నారని జిల్లాతో పాటు దేశం మొత్తం మీద అత్యధిక జనాభా ఉన్న యాదవులను ఇరు పార్టీలు విస్మరించాయని అన్నారు.అందుకే యాదవుల బలం ఇరు పార్టీలకు రుచి చూపిస్తామన్నారు.కాంగ్రేస్ పార్టీలో చేరి ఇరు పార్టీల బిసిలకు గట్టి పోటీ ఇవ్వడానికి సిద్దమైనట్లు తెలిపారు.కావున జిల్లా ప్రజలు ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనార్టీలు కాంగ్రేస్ పార్టీకి మద్దతు తెలపాలని రాహుల్ గాంధి ప్రధానమంత్రి అయితే రైతులకు రుణమాఫి జరగుతుందని అలాగే మహిళలకు బస్సుఫ్రీ,ఉచిత గ్యాస్ సిలెండర్‌లు అందిస్తున్నామని అన్నారు.కావున ప్రజలు ఆదరిస్తారనే నమ్మకంతో కాంగ్రేస్ అభ్యర్థిగా ఎంపిగా బరిలో నిలుస్తున్నామని అన్నారు.ప్రజలు ఆశీర్వదించాలని వారు కోరారు.

# డబ్బులు లేనందునే పింఛన్ల పంపిణీకి బ్రేక్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ప్రభుత్వ ఖనాజాలో డబ్బులు లేకపోవడం వల్లే నిరుపేదలకు ఇచేచ పింఛన్ సొమ్ముకు బ్రేక్ పడిందని డోన్ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. జగన్ చేతగానితనంతో పింఛన్లు పంపిణీ చేయలేక ఆ నెపాన్ని ప్రతిపక్ష పార్టీలు, ఎన్నికల కమిషన్ మీద నెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖనాజాలో ఉన్న సొమ్మును గత మార్చి16వతేదీ నుంచి 30వతేదీ వరకు సుమారు రూ.13వేలకోట్లపైగా తన అనుయాయులైన కాంట్రాక్టర్లకు పంచిపెట్టారని ఆయన మండిపడ్డారు. ఈ సొమ్ము ఎన్నికల నియామావళికి విరుద్ధంగా కాంట్రాక్టర్లకు ఇచ్చి ఖజానా ఖాళీ చేసి నిరుపేదల ఆకలికి జగన్ కారణమయ్యా రన్నారు. ఈ సొమ్మును ప్రభుత్వానికి చిత్తుశుద్ధి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.35లక్షల మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్ పంపిణీ చేయవచ్చుని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పును తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం వ్యవహరించిన తీరు కారణంగా పేదల ఇబ్బందులను ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిలపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల్లో తాము విజయం సాధించడం ఖాయమని ఆ తర్వాత పింఛన్‌దారులకు నెలకు రూ.4వేలు చొప్పున లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడం ఖాయమన్నారు. అలాగే వాలంటరీ వ్యవస్థను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకొని వారి కడుపు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటరీ వ్యవస్థను ప్రజాసేవకు అనుకూలంగా పార్టీలకు అతీంగా వారికి సేవలు అప్పగించి వారి జీవితాలను గాడిన పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

## పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించండి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరా అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా అత్యవసరపని ఉంటే తప్ప మధ్యాహ్నం బయటకు రాకుండా ఉండాలన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కలెక్టర్‌జి.సృజన మాట్లాడుతూ కర్నూలు పట్టణానికి ప్రతి రోజు సుమారు 50క్యూసెక్కుల నీరు అవసరం ఉందని, అందుకు గాను 20క్యూసెక్కుల నీరు సుంకేసుల నుంచి , 30క్యూసెక్కుల నీరు గాజులదిన్నె నుంచి తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సుంకేసులలో నీరు తక్కువగా ఉండటం వల్ల గాజులదిన్నె నుంచి 30క్యూసెక్కుల నీటిని తీసుకోవడం జరుగుతుందన్నారు. గాజులదిన్నెలో సుమారు 1.2టీఎంసీ నీరు అందుబాటులో ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లోజడ్పీ సీఈవో నాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# శ్రీ వల్లెలాంబదేవి రథోత్సవ ఆహ్వానపత్రిక విడుదల

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని హంద్రీ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లెలాంబ దేవి రథోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం ఆలయ కమిటీ వల్లెళాంబాదేవి భక్త బృందం విడుదల చేశారు. చదువుల తల్లి సరస్వతీ దేవిగా వెలసిన శ్రీ వల్లెలాంబ దేవి ఉత్సవాలు స్వస్తి శ్రీ శోభాకృత నామ సంవత్సరం పాల్గున మాసం అమావాస్య రోజున మొదలుకొని, స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సరం చైత్రమాస శుద్ధి విదియ బుధవారం వరకు అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి వైసీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి,కరెంటు మల్లారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూలవాసులు తెలిపారు. ఏప్రిల్ 8న సోమవారం ఉదయం 8 గంటలకు గోపూజ, గణపతి పూజ, పుణ్యవాహచనం, గంగపూజతో కార్యక్రమాలు మొదలుకాగా సాయంత్రం 6 గంటలకు గ్రామ ప్రజలతో అమ్మవారి ప్రభోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 9న మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు



అమ్మవారి రథంగా హెూమం, సాయంత్రం 6 గంటలకు శ్రీ వల్లెలాంబ దేవి దివ్య మంగళ రథోత్సవం జరగనున్నట్లు వారు చెప్పారు. 10న బుధవారం రోజున ఉదయం 10 గంటలకు పారువేట జరుగునని, అనంతరం వసంతోత్సవం ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. ప్రజలు, భక్తులందరూ అమ్మవారి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు. భక్తులు అమ్మవారికి సమర్పించవలసిన కానుకలను ఆలయ కమిటీ వారిని సంప్రదించి రశీదు పొందవలసిందిగా వారు తెలియజేశారు.



# నాటుసారా అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** ఎన్‌ఫోర్మెంట్స్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం లో గల బోయినపల్లి, గోవర్ధనగిరి, ఎల్బండ గ్రామాలలో సోమవారం జరిపిన దాడులలో అధికారులు ముగ్గురు వ్యక్తుల నరేష్ చేసి కోర్టుకు తరలించగా జడ్జి నిందితులను ఆదేశించారు. 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కర్నూలు జిల్లా ఎస్.పి. కృష్ణకాంత్ ఐ.పి.ఎస్. మరియు కర్నూలు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి నాగరాజు అడిషనల్ ఎస్.పి ఆదేశాల మేరకు, కర్నూల్ జిల్లా ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ సూచనల వెల్దుర్తి మండలంలోని, మండలంలోని బోయినపల్లి, గోవర్ధనగిరి, ఎల్.బండ గ్రామాలలో జరిపిన దాడులలో 20 లీటర్ల నాటు సారా సీజ్ చేసి, బోయినపల్లి గ్రామనివాసి బోయ సాలమ్మ, గోవర్ధనగిరి గ్రామ నివాసి బోయ సుంకన్న, ఎల్.బండ గ్రామనివాసి బోయ అయ్యస్వామి అనే ముగ్గురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశాము. అనంతరం వీరికి డోన్ మేజిస్ట్రేట్ గారి ముందు హాజరు పరచడం జరిగింది. ఒక్కొక్కరికి 14 రోజులు రిమాండ్ విధించారు. వారిని డోన్, కర్నూలు సబ్ జైలుకు తరలించడం జరిగింది. ఈ దాడులలో సి.ఐ రామాంజనేయులు, ఎస్.ఐ అలిబేగ్, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, విరూపాక్షి రెడ్డి, సువర్ణమ్మ పాల్గొన్నారు.



# కొమ్ముకాసే వారిపై చర్యలు తీసుకోవాలే గాని వ్యాపారులపై కాదు

- వ్యాపారస్తుల డబ్బు సీజ్ చేయడం సబబు కాదు
- టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి



జిల్లా కలెక్టరేట్ వద్ద వ్యాపారులకు మద్దతుగా మాట్లాడుతున్న శబరి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** అధికార పార్టీ వారికి కొమ్ముకాసే వారిపై చర్యలు తీసుకోవాలే గాని వ్యాపారులపై కాదని నంద్యాల జిల్లా టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి హితవు పలికారు. సోమవారం కలెక్టరేట్ సమీపంలో వ్యాపారస్తులకు మద్దతుగా బైరెడ్డి శబరితో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌లు పాల్గొన్నారు. బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో రెండు రోజుల కిందట ఒక వ్యాపారస్తుడు తన వ్యాపారం ముగించుకుని అందులో వచ్చిన డబ్బును ఇంటికి తీసుకుని పోతున్న తరుణంలో వారిపై రైడ్‌చేసి వారి దగ్గర నుంచి అక్రమంగా డబ్బు తరలిస్తున్నారని ఉద్దేశంతో వారిపై కేసులు నమోదు చేసి వారి దగ్గర నుంచి డబ్బు స్వాధీనం చేసుకోవడం సబబు కాదని అన్నారు. నంద్యాల అనేది వ్యాపారానికి ప్రసిద్ధి అని ఇక్కడ రోజుకు కొన్ని లక్షలలో వ్యాపారం జరుగుతూ ఉంటుందని అటువంటి తరుణంలో వ్యాపారస్తులపై దాడి చేసి వారి డబ్బును సీజ్ చేయడం ఎంతవరకు సమంజసం అని వారు రేపు పొద్దున వ్యాపారాలు చేసుకోవాలా వద్దా అని ప్రశ్నించారు. రెండు నెలలు ఎన్నికలకు సమయం ఉందని వ్యాపారం వద్దు అంటే ఈ అధికార పార్టీ వారికి నెలకు సరిపడా అంతా జీతాలు ఇస్తారా అన్నారు. కాబట్టి అధికార పార్టీ వారికి కొమ్ముకసే వారికి ఆర్థికంగా సహాయపడే వారిని దొంగదారులలో డబ్బులను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప వ్యాపారులపై కాదని తెలిపారు.

## టిడిపిలో చేరిన వైసీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డితోపాటు 10 కుటుంబాలు



**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ 19 వ వార్డు మారుతి నగర్ వైసీపీ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి తో పాటు 10 కుటుంబాలు పాణ్యం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత రెడ్డి నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గౌరు చరిత, బైరెడ్డి శబరి కండువాలు కప్పి పార్టీ లోకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో చేరినవారు చిన్న రుస్తుం పుల్లారెడ్డి, పరమేష్ రెడ్డి చేరారు ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, 19 వ వార్డ్ ఇన్చార్జి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, అధ్యక్షులు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, వార్డు నాయకులు బూత్ కమిటీ మెంబర్ స్వాతి కాలనీ ఇన్చార్జి రమేష్‌యాదవ్, తిమ్మయ్యయాదవ్, శివన్న, గంగులు, మౌలాలి, సత్యం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తలముడిపిలో జయహో బీసీ సదస్సులో మాండ్ర వరాలు

### డబ్బు ఇచ్చిన వారికే వైసీపీ టికెట్టు గిత్తా జయసూర్య

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో జయహో బీసీ సదస్సు కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఎన్నికల్లో జోరు హోరు అందుకుంది. పార్టీలో ప్రచారం బిజీగా నేతలు ఉంటున్నారు. రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అయితే తెలుగుదేశం పార్టీ మాత్రం ఆచితూచి అడుగులు వేస్తుంది. నియోజకవర్గాల్లో జయహో బీసీ సదస్సు ఏర్పాటు చేస్తూ అన్ని వర్గాలను తమ వైపు తిప్పుకుంటూ నంద్యాల పార్లమెంటు వర్గపు ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ గెలుపుకు సాయశక్తుల కృషి చేస్తున్నారు. సోమవారం మిడ్తూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, వంగాళ శివరాంరెడ్డి అధ్యక్షతన బీసీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాండ్ర శివానందరెడ్డి, నందికోట్కూరు నియోజకవర్గపు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిత్తా జయసూర్య మాట్లాడుతూ మొదటి నుండి బీసీలకు అండగా ఉన్నా ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని సమాజంలో సగభాగం అయిన బీసీలను వంచించే పార్టీ వైకాపానే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక బీసలకు ఎంతో అన్యాయం జరిగిందని వందల మంది బీసీలను పొట్టునపెట్టుకున్నారు. వందలాదిమందిపై అక్రమ కేసులు బనాయించారు. వైసీపీ పార్టీలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన డబ్బులు ఇచ్చిన వారికే టికెట్ ఇవ్వడం సామాన్యుడికి టికెట్ రావడంలేదని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గిత్తా జయసూర్య ఎద్దేవా చేశారు. 2009 నందికోట్కూరు ఎస్‌సీ రిజర్వు కావడంతో నాటి



సమావేశంలో మాట్లాడుతున్న జయసూర్య

నుండి నేటి వరకు నాన్‌లోకల్ వారికే టికెట్లు అమ్ముకున్న ఘనత జగన్‌దేనని ఆయన అన్నారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా నాకు అవకాశం ఇచ్చిన మాండ్ర శివానందరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. జగన్‌మోహన్‌రెడ్డి సూట్‌కేసులతో డబ్బులు తెచ్చే వారికి మాత్రమే టికెట్లు అమ్ముకుంటున్న సంస్కృతి జగన్‌దేనని స్థానికుడు సౌమ్యుడు రైతు కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి జయసూర్యకు ఒక ఓటు వేసి విద్యావంతురాలు, డాక్టరు ఉన్నత కుటుంబం నుండి ప్రజలలోకి ఆమె ఆశయాలను కొనసాగించడానికి వచ్చిన ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరి అమ్మకు ఎంపీ, ఎమ్మెల్యే రెండింటికి టీడీపీకే ఓటు వేసి గెలిపించుకుందామని జయహో బీసీ సదస్సులో మాండ్ర శివానందరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి ఈ సైకో పాలనను అంతమొందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ గుండం రమణారెడ్డి, జలకనూరు సర్పంచ్ ఎల్లయ్య, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, వంగళారవికాంత్‌రెడ్డి, సంపంగి రవీంద్రబాబు, సుధాకర్ యాదవ్, గట్టు రవి, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, గుండం సర్వోత్తమరెడ్డి, బాలనాగిరెడ్డి, సుధాకర్ యాదవ్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో టీడీపీపై బురద జల్లడం ఎన్నికల కుట్ర

### – కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** పింఛన్ల పంపిణీలో టీడీపీపై బురద చల్లడం ఎన్నికల కుట్ర మాత్రమేనని, జగన్ మోహన్‌రెడ్డి తరలించిన నిధులు రూ.13వేల కోట్లకు పింఛన్‌దారులకు లెక్కలు చెప్పాలని కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని కోడుమూరు రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు పంపిణీ చేయడం లబ్ధిదారులను మోసం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. జగన్ పింఛన్లు పంపిణీ చేయాలనుకుంటే సచివాలయం సిబ్బంది ద్వారా కూడా చేయవచ్చు కాదా అని ప్రశ్నించారు. వచేచ ఎన్నికల్లో జగన్‌ను ప్రజలు ఇంటికి పంపించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.4వేలకు పెంచడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న బస్తిపాడు నాగరాజు

## వైఎస్సార్‌ను వీడి టిడిపిలో చేరిన ముప్పపల్లి గ్రామస్తులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** వైఎస్సార్ పార్టీని వీడి ముప్పపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు శ్రీశైలం నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సోమవారం మండల పరిధిలోని ముప్పపల్లి గ్రామంలో రాహుల్ నాయక్, మల్లినాయక్,శివ, కృష్ణ, రాజశేఖర్, మోహన్, రాజుతో పాటు30 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి టిడిపిలో చేరగా బుడ్డా పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చేరుకున్న బుడ్డాకు పూలమాలలు, పుష్పగుచ్చాలు, హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుడ్డా మాట్లాడుతూ ఒక్కచాన్స్‌తో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేసి మోసం చేశారని విమర్శించారు. సైకో పాలనతో విసుగు చెంది టిడిపి పాలనను కోరుకుంటున్నారని, రాష్ట్రానికి, ప్రజల భవిషత్‌కు గ్యారెంటీనిచ్చే చంద్రబాబు అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అన్ని పథకాలను అమలు చేశాం, అభివృద్దే తమను గెలిపిస్తుందని ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తుందని, ప్రజలు నమ్మె స్థితిలో లేరని



బుడ్డా సమక్షంలో టిడిపిలో చేరిన ముప్పపల్లి గ్రామస్తులు

అన్నారు. రాష్ట్ర ప్రజలను వైసిపి మాయ మాటలకు మళ్ళి మోసపోయే స్థితిలో లేరని , రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా వైసిపికి బుద్ది చెప్పందుకు సిద్దంగా ఉన్నారన్నారు. టిడిపి గెలుపును ఎవ్వరు ఆపలేరని, ఎన్ని దుష్ ప్రచారాలను చేసినా వైసిపి ఆటలు సాగవని, వైసిపిని అంతమొందించేందుకు ప్రజలను సిద్దమయ్యారని ధీమా వ్యక్తం చేశారు. టిడిపిలో చేరికలను చూసి వైసిపి నాయకుల్లో దడ పుట్టుకుందని, వైసిపి ఓటమి ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సిద్దాపురం గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### న్యాయ విద్యార్థులపై

## ఉస్మానియా కళాశాల దురుసు ప్రవర్తన



**కర్నూల్ఎడ్యుకేషన్, మేజర్న్యూస్ :** కర్నూల్ నగరంలోని స్థానిక ఉస్మానియా బీఈడీ కళాశాల నందు సోమవారం నిర్వహిస్తున్న ఎల్.ఎల్.బి మరియు బి.ఏ.ఎల్.ఎల్.బి సెమిస్టర్ పరీక్షలు లో విద్యార్థులు పార్కింగ్ జోన్ లో ఉన్న వాహనాలు పై నో పార్కింగ్ అని రాశారు. ఇది ఏమని అడిగిన నీరజ్, బన్నీ, శివ విద్యార్థుల పై ఉస్మానియా కళాశాల మేనేజ్మెంట్ అసభ్య మాటలతో దూషించారు, అలాగే ఈ ముగ్గురి విద్యార్థులపై తప్పుడు కేసులు పెట్టి వారి జీవితాలతో ఆడుకుంటామని ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని కళాశాల మేనేజ్మెంట్ బెదిరించారు. విద్యార్థులు ప్రముఖ న్యాయవాది నాగలక్ష్మి దేవి కి జరిగిన విషయం చెప్పడంతో కళాశాల మేనేజ్మెంట్ వారు తమదే తప్పని ఒప్పుకోవడం జరిగింది.

### కోట్ల చిత్రమ్మ సమక్షంలో

## టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

**బేతంచెర్ల, మేజర్న్యూస్ :** డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కుమార్తె కోట్ల చిత్రమ్మ ,పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మీ, కోట్ల గిరిధర్ రెడ్డి సమక్షంలో పట్టణంలోని దుర్గపేట కాలానికి చెందిన 40 వైసిపి కుటుంబాలు స్థానిక నాయకుడు టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ ఆధ్వర్యంలో వైసిపి నుండి టిడిపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని స్వచ్ఛందంగా టీడీపీ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాలానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బోగోలు శేఖర్, గజ్జి శ్రీదేవి,గజ్జి శివ వరప్రసాద్ , బిరెళి మహేంద్ర,కె.నాగార్జున, కె.నాగేంద్ర, మధు కుమార్ ,సుమతి, మల్లీశ్వరిలతో పాటు మరి 30 కుటుంబాలు టిడిపి పార్టీలో చేరారు.

## 34వ వార్డులో వైసిపి ఎన్నికల ప్రచారం



**కల్లూరు, మేజర్న్యూస్ :** వైసిపి పాణ్యం ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించాలనీ కాటసాని రాంభూపాల్ రెడ్డి 34వ వార్డులో విస్తృత ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వేయించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని, కల్లూరు అర్బన్ :34 వ వార్డులో ఇంటింటికీ వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి,వేయించి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి ని చేసుకుందాం అని చెబుతూ ప్రచారం లో ముందుకు సాగుతున్నారు ఈ ప్రచార కార్యక్రమం లో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జగన్ స్వార్థ రాజకీయాల వల్ల

## పింఛన్ లబ్ధిదారులు నష్టపోతున్నారు : బీటీనాయుడు



**కర్నూలు, మేజర్న్యూస్ప్రతినిధి:** జగన్ స్వార్థ రాజకీయాల వల్ల పింఛన్ లబ్ధిదారులు నష్టపోతున్నారని కర్నూలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు బీటీనాయుడు ఆరోపించారు. సోమవారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ పింఛన్ల సొమ్ముతోపాటు ప్రభుత్వ నిధులు రూ. 13వేలకోట్లను మార్చి 16 నుంచి 30మధ్య 15రోజుల్లోనే ఎన్నికల కోడ్కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. పింఛన్ల పంపిణీ ఆలస్యం కారణం టీడీపీ, ఎన్నికల కమిషన్కు సంబంధం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ. 4వేల పింఛన్ అందిస్తుందన్నారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేకనే వాస్తవాన్ని కప్పి పుచ్చుతున్నారన్నారు. టీడీపీపై అసత్య ప్రచారాలు మానుకొని వెంటనే పింఛన్ల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## 'పెన్షన్ డబ్బును కాంట్రాక్టర్లకి మళ్లించిన ద్రోహి జగన్రెడ్డి'



**కల్లూరు మేజర్ న్యూస్:** వికలాంగులకు వితంతువులకు అవ్వ తాతలకు తదితర అవార్డులకు అభాగ్యులకు అందించే పింఛన్ డబ్బులు కాంట్రాక్టర్లకు మళ్లించిన జగన్మోహన్ రెడ్డి ఒక ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని టిడిపి పాణ్యం అభ్యర్థి గౌరు చరిత రెడ్డి నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ మాధవి నగర్ నివాసం లో గౌరు దంపతులు మాట్లాడుతూ పెన్షన్ల పేరుతో రాజకీయ లబ్ధి పొందెందుకు జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని చరిత రెడ్డి ఆరోపించారు. పెన్షన్ల పేరుతో రాజకీయ లబ్ది పొందేందుకు జగన్ రెడ్డి కుట్రలు. ప్రజలకు పెన్షన్ల పంపిణీ చెయ్యకుండా చేసి, ప్రతి పక్షాల మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడనీ అన్నారు. ఈసి వంకతో పంపిణీ, ఎగ్గొట్టే యత్నం. నిధులు ఇవ్వకుండా విపక్షాలపై దుష్ప్రచారం చేయడంలో జగన్మోహన్ రెడ్డి దిట్ట అన్నారు చివరి లబ్ధిదారుడి వరకు పెన్షన్ ఇవ్వాల్సిందే. అడ్డదారుల్లో అస్మదీయులకు వేలకోట్ల బిల్లులు చెల్లింపు చేసి అవ్వా తాతల పెన్షన్ల డబ్బులు బినామీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టె హక్కు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ఎవరు ఇచ్చారు అని చరిత రెడ్డి దంపతులు ప్రశ్నించారు.

### ప్యాకేజీలతో టిడిపి నాయకులను, కార్యకర్తలను కొనలేవు బుగ్గన

# నీ అభివృద్ధి ఎక్కడ?

### రానున్న ఎన్నికల్లో రేకుల మంత్రిని చిత్తుచిత్తుగా ఓడించండి : కోట్ల



**బేతంచెర్ల, మేజర్న్యూస్ :** ప్యాకేజీలతో టిడిపి నాయకులను ,కార్యకర్తలను కొనలేవని, వచ్చే ఎన్నికల్లో ఆర్థికమంత్రి రేకుల మంత్రిని చిత్తు చిత్తుగా ఓడించాలని డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారంమండల పరిధిలోని వీరాయి పల్లె, ముద్దవరం, ముసలాయి చెరువు గ్రామాలలో మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య అధ్యక్షతన బాబు షురిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఓటమి భయంతో మా టిడిపి నాయకులను కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తూ వినకపోతే ప్యాకేజీలు ఇచ్చి వైసిపి పార్టీలోకి ఆహ్వానించడం జరుగుతుందని బుగ్గన మీరు ఎన్ని ప్యాకేజీలు ఇచ్చిన మా నాయకులను కార్యకర్తలను కొనడం నీకు సాధ్యం కాదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు .ఎక్కడ సభలు సమావేశాలు నిర్వహించిన అభివృద్ధిని చూసి ఓటేయండి అంటున్నారు ఎక్కడ మీరు చేసిన అభివృద్ధి వేసిన రోడ్లపై రోడ్లు వెయ్యడం మీ అభివృద్ధినా, డోన్ నియోజకవర్గంలో ఎంతమంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారని సూటిగా ప్రశ్నించారు. రైతాంగం బాగుపడాలన్న పెరిగిన నిత్యవసర ధరలు తగ్గాలన్న రాష్ట్రంలో రాక్షస పాలనను కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని, డోన్ లో రేకుల మంత్రిని చిత్తుచిత్తుగా ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు జాకిరుల్ల బేగ్, భీమేష్ రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, షేక్షావల్లి చౌదరి, రవీంద్ర నాయక్, స్థానిక టిడిపి నాయకులు రాధాకృష్ణ, ఎల్లారెడ్డి, సూర్య చంద్రారెడ్డి, పుల్లయ్య, నారాయణరెడ్డి, మద్దిలేట, వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

## సంబంధిత పత్రాలతో వస్తే సహకరిస్తాం



**నందికోట్కూరు, మేజర్న్యూస్ :** న్యాయపరంగా సంబంధిత పత్రాలతో వస్తే సహకరించాడానికి తాను ఎప్పుడు సిద్ధమే అని నంద్యాల పార్లమంట్ టీడీపీ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి వీడియోసందేశాన్ని సోషల్ మీడియా ద్వారా బయలు పరిచారు. అందులోని సారాంశం ఏమిటంటే సోమవారం ఉదయం నుండి వివిధ సోకాల్డ్ చానల్లలో వస్తున్న అవాస్తవాలను నమ్మాల్సిన అవసరంలేదని సీపీఎస్ పోలీసులూ అల్లురు గ్రామంలో మా నివాసానికి రావడం వాస్తవం అయితే వారు ఎలాంటి అరెస్టు వారెంట్ కానీ, నోటీస్ కానీ ఇవ్వకుండా మీరు హైదరాబాదుకు రండి అక్కడ దీనికి సంబంధించిన నోటీస్లు ఇస్తామని బుకాయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఒక సామాన్య వ్యక్తినిసైతం నోటీస్ లేకుండా స్టేషన్లకు పిలిచే అధికారం లేదు. సంబంధంలేని కేసులో కనీసం అక్యూస్డ్గా పేరులేని కేసులో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత పత్రాలను ఏమి లేకుండా కొంతమంది నాయకుల మాటలు నమ్మి ఇలాచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో వస్తే అన్ని విధాల సహకరించాడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని ప్రకటించిన నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి న్యాయవాదులు సైతం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితులలో అక్కడకు వచ్చిన అధికారులు లేకపోవడం గమనార్హం అని తన వీడియో సందేశాన్ని ముగించారు.

## 29వ వార్డులో ఎన్నికల ప్రచారం



**కల్లూరు మేజర్ న్యూస్ :** కల్లూరు అర్బన్ 29వ వార్డు సంఘాల సుదర్శన్ రెడ్డి నగర్లో కాటసాని మాధవి లతా రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీ చేస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో 26 వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, వైసిపి నాయకులు బాలచంద్రారెడ్డి, రమేష్, సోమేశ్, హుస్సేన్ అల్లం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపటి నుండి సామాజిక పింఛన్లు పంపిణీ

- సచివాలయ ఉద్యోగుల ద్వారానే పింఛన్ల పంపిణీ
- పింఛన్దారులు పింఛన్ బుక్కులు తీసుకొని రాకూడదని సూచన
- ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పరికరాలను ఇవ్వాలని వాలంటీర్లకు ఆదేశం

**బండిఆత్మకూరురూరల్, మేజర్న్యూస్ :** సాధారణ ఎన్నికలు 2024 నేపథ్యంలో మండలంలోని 20 సచివాలయ పరిధిలలో రేపటి నుండి ఫించన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని బండిఆత్మకూరు ఎంపీడీవో విజయరావు తెలిపారు. ఎలక్షన్ కమీషన్ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సచివాలయం వద్దనే పించన్దారులకు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సంక్షేమ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితర సిబ్బంది ఫించన్ల పంపిణీలో పాల్గొంటారని అన్నారు. సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల పంపిణీ వాలంటీర్లతో చేయించరాదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాలంటీర్లను ఫించన్ల పంపిణీకి దురంగా ఉంచామని తెలిపారు. మండల వ్యాప్తంగా 244 వాలంటీర్ల వద్ద ఉన్న ప్రభుత్వ ట్యాబ్లు,మొబైల్ ఫోన్లు, బయోమెట్రిక్ డివైజ్లు, డివైజ్లు, సిమ్కార్డులు స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే ఫించన్ల కోసం వచ్చే లబ్దిదారులు ఫించన్ ఐడీ, ఆధార్కార్డులతో రావాలని ఎన్నికల కోడ్ దృష్ట్యా ఫించన్ బుక్కులను తీసుకునిరావద్దని ఎంపిడీవో విజ్ఞప్తి చేశారు. వృద్ధులకు, వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న లబ్దిదారుల ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగులు వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపిడిఓ అన్నారు .మండలంలో రేపటి నుండి అయిదు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఓ అన్నారు. సచివాలయ సిబ్బంది అందరూ కలసి ఫించన్ల పంపిణీ చేపట్టాలని విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న విజయరావు

# వైసీపీని మళ్లీ గెలిపించుకుందాం

## – ఎమ్మెల్యే అభ్యర్థి ధారా సుధీర్

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** సంక్షేమ పథకాలు ఇంటివద్దకు చేరాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని అందుకోసం వైయస్ఆర్‌సీపీ పార్టీని మళ్లీ గెలిపించుకోవాలని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిధారా సుధీర్ తెలిపారు. సోమవారం మండలంలోని సింగరాజుపల్లె, చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో నిరు పేదలకోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వైయస్ఆర్‌ఆసరా, చేయూత, పొదుపు మహిళల రుణమాఫీ, అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యా దీవెన వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా వాలంటరీ సేవలను వినియోగించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఇంటివద్దకే సంక్షేమ పథకాలను వాలంటీర్ల ద్వారా అందించిన ఘనత వైయస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో వైయస్ఆర్ పార్టీని గెలిపించాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఈ పథకాలన్నింటిని రద్దు చేస్తారని తెలిపారు. అందుకోసం ప్రతి కార్యకర్త వైయస్ఆర్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పీటీసీ సుధాకర్ రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, గ్రామ నాయకులు రామ సుబ్బారెడ్డి, సర్పంచ్ విజయకుమార్, బాల ఎల్లయ్య, సొసైటీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగరాజుపల్లెలో ఇంటింటా ప్రచారం చేస్తున్న – ధారా సుధీర్

### వాలంటీర్ వ్యవస్థపై

# కక్షగట్టిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** పెన్షన్‌ను ఇంటి వద్దకు అందించే వాలంటీర్‌పై వ్యవస్థపై కక్షగట్టిన చంద్రబాబు నాయుడుకు, టీడీపీ నాయకులకు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డు పరిధిలో వైయస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికలకు 6వ వార్డు నుంచి ఎన్నికల ప్రచారం చేయడం విజయం సాధించడం జరుగుతుందని తెలిపారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరిని కలిసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. గడపగడకు మన ప్రబుత్వంలో కేటాయించిన నిధులను వార్డు అభివృద్ధికి వినియోగించడం జరిగిందన్నారు. ఈవార్డులో చిన్నచెరువుకట్ట ప్రాంతంలో కోటి 20లక్షలతో అత్యాధునిక పార్క్‌ను, అలాగే జిమ్‌ను, వార్డులో అనేక అభివృద్ధిని చేపట్టినట్లు తెలిపారు. 1వ తేదీన పింఛన్లు అందుకుంటున్న వారికి చంద్రబాబు చేసిన కక్షపూరితమైన వ్యవహారంతో సకాలంలో పెన్షన్ అందుకోలేని పరిస్థితి నెలకొన్నది అన్నారు. దీనివల్ల పెన్షన్‌దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నంద్యాలలో నూటికి నూరుశాతం వైయస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఖచ్చితంగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం పీఠం అధిరోహించడం తథ్యమన్నారు. ఈకార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ పురందర్ కుమార్, మాజీ కౌన్సిలర్ భీమనపల్లి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి

# కొనసాగుతున్న ఇంటింటికి ప్రచారం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** కర్నూలు 39వవార్డ కార్పొరేటర్ సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సతీమణి స్టెల్లా సతీష్ పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా బి.వై.రామయ్యను, ఎమ్మెల్యే ఆదిమూలపు సతీష్‌కు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీస్

# రెడ్లు ఏ ఒక్క పార్టీ వారు కాదు..

### ★ వైకాపాకు ఎన్నికల సమయంలో రెడ్లు గుర్తొస్తారా..

### ★ మాజీ ఎల్ఎల్‌సి డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి

**ఎమ్మిగనూరుప్రతినిధి, మేజర్‌న్యూస్ :** రెడ్డి కులంలోని వారంతా ఏ ఒక్క పార్టీ వారు కాదని వారికి రాజకీయ పార్టీలలో ముఖ్యంగా వైకాపా ఏనాడు సహకారం అందించిన దాకలాలు లేవని మాజీ ఎల్ఎల్‌సి డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి పేర్కోన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ రెడ్డిలను ఎమ్మిగనూరులో విస్మరించిన వైకాపా నేతలు ఏలా రాజకీయ సమావేశాలు యేర్పాటు చేశారని విమర్శించారు.ఎంపిగా ఉన్న ఐదేళ్లు బుట్టా రేణుక రెడ్డి సామాజిక వర్గాన్ని ఏనాడు పట్టించుకోలేదన్నారు. కనీసం ఇక్కడ ఇంతవరకు పాలన చేసిన వైకాపా నేతలు రెడ్డి సామాజిక వర్గానికి ఏలాంటి పదవులు అందించారో తెలపాలని డిమాండ్ చేశారు. ఇక రెడ్డి కళాణమండపం నిర్మించి ఇస్తామని పేర్కోనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ పార్టీల్లో అన్నిట్టో రెడ్డి సామాజిక వర్గం ఉందని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఉమ్మడిగా ముందుకు పోతే రెడ్ల కళ్యాణ మండపం నిర్మాణం సాద్యం కాని పనికాదన్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో రెడ్ల కళ్యాణ మండపం నిర్మాణానికి ముందుకు ఎవరొచ్చినా తన వంతుగా రూ . 4 లోలు అందిస్తా అన్నారు. కుటుంబరాజకీయాలు చేసుకునే వారి మాయలో పడద్దు అన్నారు.



# పించన్ల పంపిణీకి నిధుల కొరతే కారణం

### – సీఎం మరో ఇద్దరిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్ల పంపిణీ చేయకపోవడానికి నిధుల కొరత తప్ప ఎన్నికల కమిషన్ గాని, తెలుగుదేశం పార్టీ కాదని మాజీ మంత్రి నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజవేఖర్‌లు ఆరోపించారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ చేయాలని సీఎం జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని, ఖాజానాలో నిధులు లేకనే కదా అన్నారు. 1.35లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్ల ఇంటి వద్ద పంపిణీ చేయడం సాధ్యం. కాని జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయం వల్లే పింఛన్‌దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారని టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛన్ అందిస్తుందన్నారు. లక్ష 35వేల మంది సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛన్లను 1వ తేదీన వారి ఇంటికి చేర్చేందుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్ చేస్తుందన్నారు. 1వ తేదీ సాయంత్రం లోపు పింఛన్ల ఇంటి వద్ద ఇవ్వకుంటే దీనికి బాధ్యతగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, సెర్ఫ్ సీఈఓ మురళీధర్‌రెడ్డి, సీఎం జగన్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్

# ఈనెల 3 నుంచి ఇష్ట కామేశ్వరి అమ్మవారి దర్శనానికి అనుమతి

### - శిఖరేశ్వరం వద్ద నేటి నుండి టికెట్ల విక్రయాలు

### - నక్కంటి రేంజ్ అధికారి ఆరిఫ్ ఖాన్

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైలానికి 20 కిలోమీటర్ల దూరంలో గల దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనానికి ఈనెల 3వ తేదీ నుండి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. గత నెల 23వ తేదీన అటవీ శాఖకు భక్తులను తరలించే వాహనాల నిర్వాహకులకు మధ్య తలెత్తిన సమస్య వలన తాత్కాలికంగా అమ్మవారి దర్శనానికి బ్రేక్ పడింది. అటవీ శాఖ ఉన్నతాధికారులు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించడంతో అమ్మవారి ఆలయ సందర్శనకు అనుమతి లభించింది.అమ్మవారికి దర్శనానికి వెళ్లే భక్తులు ఒక్కరోజు ముందుగానే ఉదయం సమయంలో టికెట్లను పొందవలసి ఉంటుంది.ఈ మేరకు మూడవ తేదీ గాను మంగళవారమే టికెట్లు తీసుకునేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా నక్కంటి రేంజ్ ఆఫీసర్ ఆరిఫ్ ఖాన్ మాట్లాడుతూ..కొన్ని అనివార్య కారణాలవల్ల గత నెల 24వ తేదీ నుండి అమ్మవారి దర్శనానికి అనుమతి నిరాకరించామని అన్ని అడ్డంకులు తొలిగాయి అన్నారు.అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భక్తులకు మంగళవారం నుంచి శిఖరేశ్వరం వద్ద గల అటవీశాఖ నక్కంటి రేంజ్ కార్యాలయం వద్ద టికెట్లను జారీ చేస్తామని,ఆన్లైన్లో ద్వారా కూడా టికెట్లు పొందే అవకాశం ఉందన్నారు.



ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం

# నవోదయ ఫలితాల్లో 'విక్టరీ' ప్రభంజనం

### ★ 35 సీట్లు సొంతం చేసుకున్న కోచింగ్ సెంటర్
























**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** ఈ ఏడాది జనవరి 20వ తేదిన జరిగిన నవోదయ పరీక్షల్లో ఎమ్మిగనూరు పట్టణంలో అపార అనుభవంతో పాటు ఏళ్లు తరబడి గా అత్యధికంగా సీట్లు సాదిస్తున్న విక్టరీ కోచింగ్ సెంటర్ మరో మారు ఈ ఏడాది కూడా ఉత్తమ పలితాలు సాదించింది.. నిర్వాహకులు ఖాజాభాషాతెలిపిన వివరాలు మేరకు వరసగా 20ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నవోదయ ప్రవేవానికి శిక్షణ ఇవ్వడం జరుగుతూ వస్తుందన్నారు. విద్యార్థుల ప్రతిభకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.. అద్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ పలితాలు మాలో మరింత బాద్యతను పెంచాయన్నారు. ఇటీవల విడుదల అయిన సైనిక్ పాఠశాలలో ప్రవేశ పరీక్షల పలితాల్లో కూడా మంచి పలితాలు సాదించి విక్టరీ అనే పేరును సార్ధకం చేసుకొన్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో వికాష్, అనీల్, రవి, పాపాన్న, ఖాజామోద్దీన్, రాజాశేఖర్, రజనీ, కంబ గిరిస్వామీ, గౌరీ, మహాలక్ష్మి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సూర్య

మంగళవారం | 02 ఏప్రిల్ 2024

# పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** తెలుగుదేశం పార్టీ బలోపేతానికై బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి స్వగృహం నందు టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథ రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డిలు మాజీ ఎమ్మెల్యే స్వగృహం నందు సమావేశమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొత్త, పాత నాయకులను , కార్యకర్తలను కలుపుకొని సమిష్టిగా కృషి చేసి నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి షబరి బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డిల గెలుపుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.

# ఎస్ఐ టిఎస్ఎస్.ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

**– జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్**


**సన్మానిస్తున్న దృశ్యం**

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు ట్రాఫిక్‌లో ఎస్ఐ టిఎస్ఎస్.ప్రసాద్ అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ప్రసాద్ పదవీ విరమణ పొందారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రసాద్ దంపతులను ఎస్పీ శాలువ, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భూమాను కలిసిన బైరెడ్డి , ఫరూక్

**– శ్రీనివాసరెడ్డిని కలిసిన బైరెడ్డి – కలసి పని చేద్దామని కోరిన బైరెడ్డి**


**భూమాతో మాట్లాడుతున్న బైరెడ్డి, ఫరూక్**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌లు సోమవారం కలిశారు. అలాగే మహానంది మండల వైసీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డిని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో భూమాతో గంట పాటు పలు అంశాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో కలసి పని చేద్దామని బైరెడ్డి కోరారు. మంగళవారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయానికి రావాలని భూమాను కోరారు. ఆయన అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి ఫరూక్ కార్యాలయానికి వెళ్ళే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి కుమార్తె యశస్వినిరెడ్డి మహానంది ఎంపిపిగా ఉన్నారు. ఆయనను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకటి, రెండు రోజుల్లో ఆలోచించి చెబుతానని శ్రీనివాసరెడ్డి బైరెడ్డికి చెప్పినట్లు తెలుస్తోంది. వీరి వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ కొట్టాల శివనాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించండి


**మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి అధికారుల బాధ్యతలు, నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వివరించారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసుల, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాల గురించి వివరించారు.

# కాటసానికి రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీనే –మాజీ ఎమ్మెల్యే బీసీ


**పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ**

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి రాకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీనే అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. సోమవారంనాడు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాటసాని రామిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీ అని ఈ రోజు ఆ పార్టీపై తాను విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. కాటసాని కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి తనపై చేసిన నిరాధారమైన విమర్శలను తాను తిప్పికొట్టారు. రైళ్ల దోపిడీలు, గొర్రెల దొంగతనాలు , కిరాయి మర్డర్లు చేసి డబ్బులు సంపాదించింది కాటసాని కుటుంబమేనని అన్నారు. ఆస్థి కోసం సొంత అన్న కాటసాని నాగార్జున రెడ్డిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని తెలిపారు. కాటసాని కుటుంబానిది నీచ సంసృతి అని తాను వ్యక్తిగతంగా ఎక్కడా కాటసాని కుటుంబాన్ని విమర్శించలేదని అయితే తన కుటుంబంపై తనపై వైసీపీ నాయకుడు వ్యక్తిగత విమర్శలకు దిగిన తరువాతనే తాను కూడా విమర్శించాల్సి వచ్చిందని తెలిపారు. తాను గతంలో సైకిల్‌పైన కూడా తిరిగానని ఆ తరువాత బైకు, కారులలో తిరిగేవాడినని తాను అన్యాయంగా సంపాదించలేదని కాటసాని 5సంవత్సరాల్లో రెండు ఇంద్ర భవనాలు ఎలా కట్టాడో చెప్పాలన్నారు. తాను మానవతా హృదయంతో కాటసాని రామిరెడ్డి కుమారుడు చనిపోతే వారి ఇంటికి వెళ్లానని నేడు మానవత్వం లేకుండా కాటసాని ఓబుల్ రెడ్డి విమర్శించడం ఎంత వరకు సమంజసమన్నారు. వైసీపీ బెదిరింపులకు భయపడేది లేదని సవాలుకు ప్రతి సవాల్ విసురుతూనే ఉంటానని 5సంవత్సరాలు అధికారంలో లేకపోయనా అనుక్షణం కార్యకర్తలకు అండదండగా నిలిచి వారి వెన్నంటే ఉన్నానని అన్నారు. ఇలాంటి నీచ రాజకీయ సంస్కృతిని ఇప్పటికైనా మానుకోవాలని తన భార్య ఇందిరమ్మపై హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటున్న తన కుమారుడిపై విమర్శలకు దిగడం దురదుష్టకరమని అన్నారు. జరిగిన పరిణామాలన్నింటిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రామనాథ్ రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, రాయలసీమ సలాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాగళం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహించిన వైసీపీ సర్కార్**
**టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ**


**మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** జాతీయ టీడీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాగళం సభను విజయవంతం చేసిన ఎమ్మిగనూరు నియోజవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, తెలుగు యువత సభ్యులు, టీఎన్ఎస్ఎఫ్‌సభ్యులు, ఐటీడీపి సభ్యులు, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు,ప్రజలకు, అధికారులకు, అనదికారులకు ప్రతి ఒక్కరికీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వర రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. భగభగ మండే మండుటెండను సైతం లెక్కచేయకుండా చల్లని చంద్రుడిలాంటి చంద్రబాబు ప్రసంగాన్ని విన్న ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్రంలో ఎక్కడ కూడా వాలంటీర్ల సేవలను ఉపయోగించుకోవడానికి వీలు లేదు అని ఎన్నికల కమీషన్ వైసీపీ పార్టీకి ముందే చెప్పిన కూడా నేడు అవ్వ తాతలకు, వికలాంగులకు, వితంతువులకు రావాల్సిన పెన్షన్ డబ్బులు పంపిణీ విషయంలో టిడిపి పార్టీ వల్ల పంపిణీ చేయలేక పోతున్నాం అని చెప్పుకోవడం చూస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వారి పార్టీ నాయకుల ముందు చూపు ఎలా ఉంది ప్రజలకు అర్థమైందని ఎద్దేవా చేశారు. పెన్షన్లు వాలంటీర్లు ఉంటేనే ఇవ్వాలా? సచివాలయం ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయడంలో తప్పేముంది అని ప్రశ్నించారు. ఎలాగైనా ప్రజలకు టిడిపి పార్టీ మీద చెడ్డ పేరు తీసుకురావాలి అనే ఆలోచన తప్ప ప్రజలకు మంచి చేయాలని ఆలోచనే వైసీపీ ప్రభుత్వానికి లేదని ఆయన దుయ్యబట్టారు. వెంటనే పెన్షన్ డబ్బులు విడుదల చేసి అర్హులకు పెన్షన్ డబ్బులు ప్రభుత్వం తరపున అందివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని 82 మంది వాలంటీర్లు ఉండగా, అందులో దాదాపు 67 మంది వాలంటీర్లు వారి విధులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి, రాజీనామాల పత్రాలను ఎంపిడిఓ శివశంకరప్పకు సోమవారం అందజేశారు. నేడు కూడా మిగిలిన వాలంటీర్లు రాజీనామాలు చేస్తారని పేర్కొన్నారు. అలాగే వాలంటీర్లకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, బయోమెట్రిక్ డివైస్ హ్యాండ్‌వర్ పరికరాలను గ్రామ పంచాయితీ అధికారికి ఉదయాన్నే అందజేశామని వాలంటీర్లు తెలిపారు.వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, ఆయన బినామీ నిమ్మగడ్డ రమేష్ వాలంటీర్ల గురించి కోర్టులో వేసి అవమానించినందుకు మేమందరం మూకుమ్మడిగా రాజీనామాలు చేశామన్నారు.



# నూర్‌భాషాలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగనే..

**నూర్ భాషాల మద్దతు వైసీపీకే**

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నూర్ భాషాలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చింది ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని రాష్ట్రంలోని నూర్ భాషాల మద్దతు వైసీపీకే అని రాష్ట్ర నూరు భాషాల సంఘం అధ్యక్షులు, మైనార్టీ రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ అన్నారు. సోమవారం రాష్ట్ర జలవనరుల శాఖ సలహా మండలి సభ్యులు, మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూర్‌భాషాల సంఘం అధ్యక్షులు బాజీ మాట్లాడుతూ ప్రత్యేక జీవోను వైసీపీ ప్రభుత్వం మార్చి 12వ తేదీన జీవో జారీ చేశారన్నారు. ఈ జీవో ప్రకారం ఎవరైతే నూర్ భాషా కులస్తులను అవహేళనగా మాట్లాడితే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకునే విధంగా జీవో జారీ చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర నూర్ భాషాల సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గల్లో 158 నియోజకవర్గాల్లో మా నూర్ భాషా ల ఓటింగ్ ఉందని 20 నుండి 25 లక్షల పై చిలుకు నూరు భాషాలు ఉన్నారని మమ్మల్ని గుర్తించి మా కోసం ప్రత్యేక చట్టాన్ని జీవో రూపంలో ఇచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే మా వారి మద్దతు ఉంటుందన్నారు. అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 6 మండలాల్లో దాదాపు 20వేల మంది నూర్ భాషాల ఓటర్లు ఉన్నారని వారందరినీ కలిసి చెప్పడం జరిగిందన్నారు. వైసీపీకే వారందరూ మద్దతు పలుకుతారన్నారు. ముఖ్యమంత్రి ముందు మా మూడు ప్రధాన సమస్యలను ఉంచడం జరిగిందని మా కులాన్ని హేళనగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకునేలా జీవో జారీ చేయాలని, షాది తోఫా అందజేయాలని కోరమన్నారు. అలాగే మా పిల్లల చదువులకు సంబంధించి టీసీలో ఇండియన్ హిందూ దూదేకుల బదులు ఇండియన్ ముస్లిం దూదేకులుగా టిసి ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అందులో రెండింటినీ ఆయన అమలు చేశారన్నారు. సంఘంలో మా గౌరవాన్ని పెంచే విధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. అనంతరం మాజీ శాసన మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి టిడిపి, జనసేన, బిజెపిల ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ తీసివేస్తారని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారన్నారు. క్రిస్టియన్ మైనారిటీ సోదరులు గమనించాలన్నారు. ఐదు సంవత్సరాల పాలనలో మంచి చేశామనితాము చేసిన మంచి గురించి ప్రతి ఇంటిలో చర్చ జరగాలని ఆలోచించి మంచికి ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బ్రిజేంద్ర రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచ బ్రహ్మానంద రెడ్డి కి మంచి మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పుటాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, తాలూకా వైసిపి నాయకులు గంగుల సుదర్శన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నూర్ భాషా ల జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, నూర్ భాషా ల సంఘం నాయకులు శిల్పి సుబ్బరాయుడు, గుర్రప్ప, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


**గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం**

# పేదవాడి తరపున నిలబడే వ్యక్తిని గెలిపించాలి

**సిఎం జగన్ అంటే భయంతోనే కూటమితో చంద్రబాబు పొత్తు**

**బుక్కాపురం నుండి ఎన్నికల శంఖారావం పూరించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**

**రెండవసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు మీ ఆశీర్వాదం కావాలి**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** 2019 నుండి 2024 వరకు ప్రతి సంక్షేమ పథకం నేరుగ పేదవాడి ఖాతాలోనే జమ అయ్యాయని, ఏ మధ్యవర్తిత్వం లేకుండా, నాయకుల ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్దిదారుడికి సిఎం జగన్ సంక్షేమ పథకాలను అందించారని, పేదవాడి పక్షాన నిలబడే నాయకుడినే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. మండల పరిధిలోని బుక్కాపురం గ్రామం నుండి సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ తన ఎన్నికల ప్రచారానికి శంఖారావాన్ని పూరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ జగనన్న ముఖ్యమంత్రిగా చేపట్టిన, పేదలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ బుక్కాపురం గ్రామానికి చేరుకోగానే వైకాపా నాయకులు శంకర్‌రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దస్తగిరి ఆధ్వర్యంలో ఆమెకు పూలమాలలతో స్వాగతం పలికారు.


వృద్దురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే

అనంతరం గ్రామంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కృష్ణాపురం గ్రామ సర్పంచ్ ఎల్లస్వామి ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె గ్రామంలో వృద్దులు, వితంతువులు, వికలాంగులతో మాట్లాడుతూ నెలనెల ఇంటి దగ్గరకే వచ్చి పించన్‌లు పంపిణీ చేస్తున్న వాలంటీర్లపై నారా చంద్రబాబు కోర్టకు వెళ్ళి వారి విధులు నిర్వహించకుండా అడ్డుకున్నారని, దీంతో పించన్‌దారులు నేడు పించన్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అందుకు కారణం నారా చంద్రబాబు అని, రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి టిడిపిని శాశ్వతంగా రాష్ట్రం నుండి తరిమేయాలని ప్రజలను కోరారు. అనంతరం రామళ్ళకోట గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, యువనేత కంగాటి రామ్మోహన్‌రెడ్డిలు గ్రామంలో వెలసిన శ్రీవనం లక్ష్మీవెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాలలో వైకాపా నియోజకవర్గ యువనేత కంగాటి రామ్మోహన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, మండల వైకాపా నాయకులు శ్రీరామ్‌రెడ్డి, నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, అనంతరెడ్డి, రత్నపల్లి రమణారెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు డైరెక్టర్ గట్టు ఆరీఫ్, పట్టణ వైకాపా కన్వీనర్ వెంకట్‌నాయుడు, రామళ్ళకోట రాధాకృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ మాలిక్ భాష, కృష్ణాపురం గ్రామ వైకాపా నాయకులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సాపురం కృష్ణారెడ్డి, బింగిదొడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, సుంకిరెడ్డి, సోమన్న, రామళ్ళకోట గ్రామ వైకాపా నాయకులు మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, జడ్పిటిసి సుంకన్న, బత్తల రాముడు, డీలర్ శీను, పుల్లగుమ్మి నాగార్జున రెడ్డి, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నను గెలిపించాలంటూ సోదరి ప్రచారం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఆళ్ళగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంగుల బిజేంద్రారెడ్డిని గెలిపించాలంటూ ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగాఅమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను,గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. తన సోదరుడు గంగుల నాని కి ఓటు వేసి అత్యంత మెజారిటీ తో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమం లో ఎంపిపి వీరభద్రుడు,సర్పంచ్ శంకరమ్మ భాయి,వైసీపీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,మాజీ ఎంపిపి మస్తాన్,ఎంపీటీసీ వెంకట రాముడు,వైసీపీ నాయకులు జగదీశ్వర రెడ్డి,శేషు రమేష్, రహమాన్,చాంద్‌బాష,సుబ్బారాయుడు,దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతికారెడ్డి

# నాలుగో వార్డులో చలివేంద్రం ఏర్పాటు చేసిన కౌన్సిలర్ తబ్రేజ్




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని నాలుగో వార్డ్ కౌన్సిలర్ యస్.యస్.తబ్రేజ్ జన్మదిన సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అయాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఈ చలివేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య అధ్యక్షులు బింగిమళ్ల శ్యాంసుందర్, కో ఆప్షన్ నెంబర్ పడనకండ్ల సుబ్రహ్మణ్యం, మహానందీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చెంచు గారి వేణు గోపాల్, మూడో వార్డు కౌన్సిలర్ అబ్దుల్ సమద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తబ్రేజ్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వేసవి లో చలివేంద్రం దాదాపు 72 రోజులు పెట్టడం జరుగు తుందని ఎండకు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు దాహార్తి తీర్చడానికి కూలింగ్ వాటర్ మంచినీరుతో సహా ప్రతి ఆదివా రము మజ్జిగ, ఆరెంజ్ జ్యూస్ ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయ కులు తిరివీధి సురేష్, సుమ శ్రీరవి, మైనార్టీ నాయకులు షాహిన్షా, గౌండ రసూల్, గౌస్ మరియు ,4 వ వార్డ్ ప్రజలు మిత్రులు పాల్గొన్నారు.

# క్రిష్ణగిరిలో బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ



**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని టి.గోకులపాడు,తోగర్చేడుగ్రామాలలో బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ కార్యాక్రమాన్ని టీడీపీ పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.యి శ్యాంబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనే మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3 వేల నిరుద్యోగాభృతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే స్కూల్‌కు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడా దికి రూ. 15 వేలు అలాగే రైతులకు ప్రతి ఏటా రూజ20 వేల ఆర్థిక సహాయం మరియు ప్రతి ఇంటికి చితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తారని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి మహిళకు నెలకు రూ. 15 వందల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మహి ళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో కె.యిశ్యాంబాబు ఇంటింటికి తిరుగుతూ బాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టో గురించి వివరించారు. కర్నూలు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ నబీసాహెబ్,టీడీపీ మండల అధ్యక్షులు కటారుకొండ మర్రిశ్రీరాములు, నాయకులు అమకతాడు వీరభద్రుడు,నక్క నాగరాజు,ప్రధాన కార్యదర్శి యూ.గురుస్వామి, మండల తెలుగు యువత అధ్యక్షులు బోయ బొంతిరాళ్ల రఫి,అద్వకేటు ప్రసాద్,గోకులపాడు సర్పంచ్ చిన్న రామాంజనేయులు,తొగర్చెడు గ్రామనాయకులు వై.శివరాముడు,ఆయా గ్రామాల టీడీపీ నాయకులు,కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు ఇంకా పలువురు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీలను ప్రారంభించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి


క్రీడాకారులతో ముచ్చటిస్తున్న బైరెడ్డి

**పాములపాడు మేజర్ న్యూస్ :** ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని వేంపెంట గ్రామంలో సోమవారం ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర షాప్ చైర్మన్ ,రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు నిర్వాహకులు డప్పుల శబ్దాలతో సందడి చేశారు అనంతరంకబడ్డీ పోటీలను ప్రారంభించారు గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను గుర్తింపు తెచ్చేందుకే ఆడదాం ఆంధ్ర నిర్వహించామని గుర్తు చేశారు ఎన్నికలవేళ ఎలాంటి గొడవలు నిర్వహించకుండా కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు చంద్రమౌళి, వైసీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డి మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి రమణారెడ్డి తుమ్మలూరుసర్పంచ్ వరప్రసాదరావు సొసైటీ చైర్మన్‌లు గడ్డం కృష్ణారెడ్డి ,చౌదయ్య, జేఏసీ కన్వీనర్ నాగరాజు పిఎంసి చైర్మన్ మాలిక్, బంగారం కమలాకర్ లింగస్వామి అంబయ్య కబడి పోటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన మైనార్టీ నాయకులు

**ఎమ్మిగనూరుటౌన్,మేజర్ న్యూస్ :**

ఎమ్మిగనూరులో జరిగిన ప్రజాగళం సభకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని ఎమ్మిగనూ రు టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తురేగల్ నజీర్ అహమ్మ ద్ ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యం లో మర్యాద పూర్వకంగా కలిశారు. మైనార్టీల సమస్యల గురించి విన్నవించినట్లు ఆయన తెలిపారు. బీవీ జయ నాగేశ్వర రెడ్డి గెలు పుకు మైనార్టీలు కృషి చేస్తామని చెప్పడం జరిగిందని నజీర్ తెలిపారు.


చంద్రబాబుతో నజీర్ అహమ్మద్

# ఆళ్లగడ్డలో రైతులను నాయకులే ఇబ్బంది పెడుతున్నారు..

**అన్నింటికి లెక్క చెబుతా...**

**ఎమ్మెల్యేగా నువ్వు ఆళ్లగడ్డకు ఏమి చేసావో చెప్పగలవా...**

**దేవుడి మీద ప్రమాణాలు చేస్తే అబద్ధాలు నిజాలు అవుతాయా.. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ**

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎంతో దారుణంగా ఉందో అందరం చూస్తున్నామని అలాగే ఆళ్లగడ్డలో రాజకీయాలు ఏవిధంగా తయారయ్యాయో అందరికీ తెలుసు అని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రైతులనే నాయకులే ఇబ్బందులు పెడుతున్నారని ఆళ్లగడ్డ టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో బాధిత రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి ఎమ్మెల్యేగా వ్యవహా రించలేదన్నారు. మీ కుటుంబ సభ్యులు తప్పులు చేసిన అడ్డుపడకుండా ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నావని ప్రజలకు ఏమి చెబుతావని ఆమె విమర్శించారు. నా ఇంటి సొమ్ము తిన్న వారితో ప్రెస్ మీట్‌లు పెట్టి మాట్లాడిస్తున్నావని అన్నింటికి లెక్క చెబుతానన్నారు. నా అవినీతి ఆరోపణ లు చేశావు గాని ఈ ఐదు సంవత్సరాల కాలంలో నా అవినీతిని నిరూపించగలవా అని ప్రశ్నించారు. అడ్డమైన వాళ్లతో ప్రెస్ మీట్‌లు పెడితే ప్రజలు ఎవరూ నమ్మరు అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడారని ఎవరైనా నిజమైన రైతులతో మాట్లాడించారా అని ప్రశ్నించారు. కేవలం మీ భజన పరులతోనే మాట్లాడించారని ఆమె ఆరోపించారు. ఎమ్మెల్యే కంటే మన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కంటే వాళ్ళ అమ్మ మహా తెలివైనదని అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ తాలుకాలో నీళ్లు లేవని రైతులు లబోదిబో మంటుంటే ఎమ్మెల్యే తల్లి ఎర్రగుడిదిన్నె చెరువులో చేపల పెంపకం పెట్టిందని ఆమె ఆరోపించారు. ఆ చెరువులో నీళ్లు రైతులకు ఇవ్వకుండా అడ్డుపడింది మీరు కాదా అని ప్రశ్నించారు. గుడి ముందు దేవుని పై ప్రమాణం చేస్తే అబద్ధాలు నిజాలు అవుతాయా అని ఆమె ఎద్దేవా చేశారు. నాతో పాటు చందలూరు రైతులు కూర్చున్నారని వారు తమకు జరిగిన అన్యాయాన్ని మీడియా సాక్షిగా చెప్పారన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే ఆళ్లగడ్డ మొత్తాన్ని అతలాకుతలం చేశారని ఆళ్లగడ్డకు నీటి సమస్య వస్తే మీకు అంతా కమిషన్ బాగుంటుందన్నారు. ఐదు సంవత్సరాల్లో నువ్వు చేసిన అభివృద్ధి గురించి మంచి గురించి పది నిమిషాలు మాట్లాడితే నీకు నాయ కుడిగా ఒప్పుకుంటానని అఖిలప్రియసవాల్ చేశారు. అసలు సమస్యపై మీరు ఎప్పుడూ మాట్లాడరని ఆమె ఎదవ చేశారు. మేము మమ్ములను నమ్ముకున్ననాయకులకు, కార్యకర్తలకు మంచి గుర్తింపు ఇస్తామని కుటుంబ సభ్యులుగా చూసుకుంటామని అఖిలప్రియ స్పష్టం చేశారు. కానీ మీరు మాత్రం నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు ఇస్తారా అని ప్రశ్నించారు. మీ ముఖ్య అనుచరుడుగా ఉన్న ఆళ్లగడ్డలో పెట్రోల్ బంకు నడుపుకునే వ్యక్తి గురించి మీ అమ్మ ఎంత నీచంగా మాట్లాడిందో నా దగ్గర ఆధారాలు ఉన్నాయని త్వరలోబయటపెడతానన్నారు. అనంతరం చిలకలూరు, చందలూరు గ్రామాలకు చెందిన బాధ్యత రైతులు అంజన్, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ లు మాట్లాడుతూ ఎర్రగుడిదిన్నె చెరువు కింద 2000 ఎకరాల అపంటను సాగు చేశామని సాగునీరు లేకపోవడంతో తాము పంట నష్టపోయామన్నారు. ఎర్రగుడిదిన్నె చెరువు నుండి తమకు సాగునీరు ఇవ్వకపోవడంతో ఎంతో నష్టపో యామన్నారు. సాగునీరు ఇవ్వాలని తాము అడుగగా చెరువులో చేపలకు వడదెబ్బ తగులుతుందని నీళ్లు ఇవ్వలేమని చెప్పడం జరిగిందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

# రూ.50వేలు మించితే రశీదులు తప్పనిసరి

### – ఎన్నికల నియమాలపై వ్యాపారులతో సమావేశం
### – జిల్లా కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో రూ.50వేలు మించి నగదు తీసుకుని వెళితే సంబంధిత రశీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపారులు రశీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని ఎవరికి మినహాయింపు ఉండదని ఇందుకు వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, అందరూ సహకరించాలని కోరారు. నగదుకు సంబంధించిన బిల్లులు, రశీదు ఓచర్లు, పేమెంట్ ఓచర్లు, సంబంధిత వివరాలన్నీ ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామళితో భాగంగా 29 రకాల వస్తువులు అధిక


వ్యాపారస్తుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు


పాల్గొన్న వ్యాపార సంఘాలు

సంఖ్యలో కొనుగోలు చేసి డిస్ట్రిబ్యూషన్ జరిగే సంబంధిత వస్తువులను సీజ్ చేస్తామని కలెక్టర్ వివరించారు. రూ.20లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాలన్నారు. అలాగే రూ.40లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాలన్నారు. వ్యాపార సంబంధిత నగదు రవాణా చేస్తే ట్యాక్స్ ఇన్‌వాయిస్, బిల్లు డెలివరీ, చలానా పేమెంట్ ఓచర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధిక మొత్తంలో నగదు, లిక్కరు, ఓటర్లను ప్రలోభపరిచే సామాగ్రి అక్రమ తరలింపుపై పూర్తి స్థాయిలో నిఘా ఉంటుందన్నారు. ఈ అంశానికి సంబంధించి ఐటీ, జీఎస్టీ, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలు నిరంతరం పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలన్నారు.

### నెరణికి తండాలో
# దాహం.. దాహం

★ ఎడ్ల బండి ద్వారా మంచినీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

**హొళగుంద, మెజర్‌న్యూస్ :** హొళగుంద మండలం నెరణికి తాండ గ్రామంలో మంచినీటి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.మండుతున్న ఎండల వేడికి దాహం..దాహం అంటు ప్రజలు నీటి అలమటిస్తున్నారు.మంచనీటి కోంసం గ్రామం నుండి బహుదూర ప్రాంతాలకు ఎడ్లబండిని కట్టుకుని డ్రమ్ములు పెట్టుకుని బోరుబావులకు వెళ్ళి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఆ గ్రామ ప్రజలకు ఏర్పడింది. మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామం వైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ఏర్పడిన మంచినీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


ఎడ్లబండిలో డ్రమ్ములు పెట్టుకుని నీటిని తెస్తున్న దృశ్యం

# అభివృద్ధి మాటున జేబు నింపుకున్న బుగ్గనను ఇంటికి పంపుదాం

### మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకుంటూ, అభివృద్ధి మాటున తన జేబును నింపుకున్న మంత్రి బుగ్గనను త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఇంటికి సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బావిపల్లె, హుస్సేనాపురం గ్రామాలలో కోట్ల సుజాతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాలలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజల కష్టాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాన్ని ప్రజలకు వివరిస్తూ, రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని, అభివృద్ధి అంటే నియోజకవర్గ ప్రజలకు రూచిచూపిస్తామన్నారు. కావున జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి డోన్ నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బావిపల్లె సర్పంచ్ లింగన్న, ప్యాపిలి మాజీ ఎంపిపి తొప్పెల శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, నాయకులు చంద్రపల్లె లక్ష్మినారాయణయాదవ్, గిరిధర్‌యాదవ్, మెట్టుపల్లె సుదర్శన్, ఆర్‌ఈ.నాగరాజు, భాస్కర్‌నాయుడు, ఘనమద్దయ్య, రామ్మోహన్‌యాదవ్, రమణగౌడ్, చంద్రపల్లె ఆచారి, మాధవరం స్వామి, కోదండరామయ్యయాదవ్, శివప్రసాద్, రామాంజీ, హుస్సేనాపురం ఆర్మీ తిమ్మారెడ్డి, చెన్నారెడ్డి, బీజేపి నాయకులు దామోదర్‌నాయుడు, వడ్డె మహరాజ్, మధుశేఖర్, రమేష్‌గౌడ్, తొప్పెల శివ, పోతుదొడ్డి పుల్లారెడ్డి, సందీప్, హుసేనాపురం మురళీరెడ్డి, జనార్ధన్, ప్రతాప్, రామ్మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ, టిడిపి నాయకులు

# ఈవీఎం కనెక్షన్‌పై అవగాహన ఉండాలి

### – జిల్లా కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఎన్నికల పోలింగ్‌సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పోలింగ్ రోజున పూరించాల్సిన 17సి, పీవో డైరీ, పీవో రిపోర్ట్‌లతోపాటు ఈవీఎం కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం నగంలోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ లో సాధారణ ఎన్నికల–2024 నిర్వహణపై మొదటి సెషన్‌లో కోడుమూరు, ఆదోని, రెండవ సెషన్‌లో కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల పీవోలు, ఏపీవోలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో మీ అందరి ఎన్నికల అనుభవం చూసుకున్నట్లు అయితే ఈవీఎంలు సరిగ్గా కనెక్ట్ చేయనందున పనిచేయడం లేదనే అపో హలతో కంగారుపడిన సందర్భాలు ఎదురై ఉండవచ్చని, అటువంటి పరిస్థితి తిరిగి రాకూడదనే ఉద్దేశ్యంతో పీవో, ఏపీవోలకు హ్యాండ్సాన్ ట్రైనింగ్ ఇవ్వడం కోసమే ఈ శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. మే 13న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. పీవో హ్యాండ్ బుక్స్‌ను కూడా తెలుగులో అనువదించి నోట్స్ రూపంలో ప్రతి ఒక్కరూ చదువు కునే విధంగా ఇవ్వడం జరిగిందని, త్వరలోనే పీవో హ్యాండ్‌బుక్స్ మీద కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జేసీ నారపురెడ్డి శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారులు భార్గవతేజ, శివ్‌నారాయణ్‌శర్మ, శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, పీవో, ఏపీవోలు పాల్గొన్నారు.


పీవో, ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

### మేం ఏ ముస్లిం కుటుంబానికి
# అన్యాయం చేయలేదు: టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును సరిగ్గా వాడుకోకపోతే మరో ఐదేళ్లు నష్టపోతామని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని కేవీఆర్ గార్డెన్‌లో ఉన్న సూపర్ ఫంక్షన్ హాల్‌లో 10, 11వవార్డులకు సంబంధంచిన ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. తాము 40ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్నామని, ఇంతవరకు ఏ ఒక్క ముస్లిం కుటుంబానికి అన్యాయం చేసింది లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజపీ ఉమ్మడి కూటమి ఓ టు వేస్తే ముస్లింలకు అన్యాయం జరుగుతుందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రమే బీజేపీతో పొత్తు పెట్టుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటులో సీఏఏ, ఎన్‌ఆర్‌సీ బిల్లులకు వైసీపీ పూర్తి మద్ధతు తెలిపిందని గుర్తు చేశారు. ఒక చేయి ఎత్తి మద్ధతు తెలుపమంటే ఏకంగా రెండు చేతులు ఎత్తి మద్ధతు తెలిపిన ఘనత వైసీపీకి దక్కిందన్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వం వస్తే బానిస బతుకులే ఉంటాయన్నారు. తాను గెలిస్తే కర్నూలును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. తాము కష్టపడే వాళ్లమని అందుకే సైకిల్ గుర్తు వచ్చిందని, గాలి మాటలు చెబుతున్నందుకే వైసీపీకి అల్లా ఫ్యాన్ గుర్తు వచ్చేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మెహబూబ్‌ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బషీర్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్‌బాష, మౌలాన్‌ముస్తాఫా, ఖాజా, గౌస్, జియా, ఫర్జానా, సఫా, చిన్నమ్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీజీ భరత్

### ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను
# కలిసిన గూడూరు గ్రామస్తులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** గూడూరు గ్రామానికి చెందిన ప్రజలు సోమవారం కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కలిసి తమ మద్ధతు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ జగనన్న పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. ఇవన్నీ మళ్లీ కొనసాగాలంటే సీఎంగా మళ్లీ జగనన్నే రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు గ్రామస్తులు అరుణ్‌కుమార్, రమేష్, వెన్నెల, శ్యాంసన్, బాబు, దైవదర్శనం, సురేంద్ర, సురేష్, రూబెన్, ఆంజనేయులు పాల్గొన్నారు.


మద్ధతు తెలుపుతున్న దృశ్యం

### నంద్యాల పార్లమెంట్ బీజేపీ కో ఆర్డినేటర్‌గా
# అభిరుచి మధు

**నంద్యాల, మేజర్‌న్యూస్‌బ్యూరో :** నంద్యాల జిల్లా పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా అభిరుచి మధును అధిష్టానం నియమించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ విజయవాడలో అభిరుచి మధుకు కో ఆర్డినేటర్‌గా బాధ్యతలను అప్పగిస్తూ నియామక పత్రాన్ని అందించారు. అనంతరం నంద్యాల పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ కన్వీనర్లు ముఖ్య కార్యకర్తలతో ఆమె జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉమ్మడి పొత్తుతో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. పొత్తులో భాగంగా కొన్ని పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను బీజేపీకి కేటాయించారన్నారు. నంద్యాల అసెంబ్లీ టిక్కెట్ కోసం చివరి వరకు ప్రయత్నించామని తెలిపారు. అప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని ప్రకటించడంతోపాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ముగ్గురు మైనార్టీలకు అవకాశం కల్పించిందన్నారు. నంద్యాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆదేశించారు. నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు సేవలను అధిష్టానం గుర్తించిందన్నారు. అందులో భాగంగా కో ఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించిందన్నారు. ఎన్నికల బాధ్యతలను అభిరుచి మధు నిర్వహిస్తారన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ, వార్డు స్థాయిల్లో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. పొత్తులో పోటీ చేస్తున్న అభ్యర్థులు బీజేపీ కండువా వేసుకొని ప్రచారంలో పాల్గొంటారని ఆ మేరకు ఆయా పార్టీల అధినేతలు అభ్యర్థులకు సూచించినట్లు ఆమె తెలిపారు.


దగ్గుబాటి పురందేశ్వరీని మర్యాద పూర్వకంగా కలసి అభిరుచి మధు